సాంస్కృతిక ఉత్సవాల్లోకి దివ్యాంగులు


మాట్లాడుతున్న గుమ్మడి వెన్నెల

రాంనగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక ఉత్సవాలలో దివ్యాంగులను భాగస్వాములను చేస్తామని తెలంగాణ సాంస్కృతిక సంస్థ చైర్మన్ గుమ్మడి వెన్నెల పేర్కొన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కమిటీ, హెలెన్ కెల్లర్ విద్యా సంస్థలు, రాష్ట్రసాంస్కృతిక భాషాశాఖల సౌజన్యంతో హెలెన్ కెల్లర్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 30 మంది విద్యార్థులకు రమీజాబీ స్మారక అవార్డులను అందజేసి మాట్లాడారు. దివ్యాంగుల ప్రతిభాశక్తి సామర్థ్యాలను గుర్తిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక ప్రధాన కార్యదర్శి మురళీధరన్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.అడవయ్య, హెలెన్ కెల్లర్ విద్యా సంస్థల చైర్మన్ ఉమార్‌ఖాన్; నాయకులు నాగేందర్, హిమాత్‌ఖాన్, డాక్టర్ పి.అనురాధ, వరమ్మ, ఆర్.వెంకటేష్; స్వామి, ఉపేందర్, గంగాధర్ పాల్గొన్నారు.

హెలెన్ కెల్లర్ విగ్రహాలను ఏర్పాటు చేయాలి

రాంనగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, జిల్లా కేంద్రాల్లో హెలెన్ కెల్లర్ విగ్రహాలను ఏర్పాటు చేయాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ డెఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వల్లభనేని ప్రసాద్, వి.భారతి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని సంస్థ కార్యాలయంలో హెలెన్ కెల్లర్ జయంతిని డీఎస్‌డీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రేమ్ కుమార్, షరీఫుద్దీన్, వాసుదేవరావు, ఆంజనేయులు, కల్యాణ్ కుమార్, హబీబ్, మునీషాబేగం తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి దోహదపడిన పీవీ సంస్కరణలు

చిక్కడపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రిగా పీవీ నరసింహారావు చేసిన సంస్కరణలు తర్వాతి కాలంలో దేశ ప్రగతికి ఎంతో దోహదపడ్డాయని హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో శుక్రవారం ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా మాజీ ప్రధాని పీవీ నరసింహారావు యాదిలో పేరిట సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు మాట్లాడుతూ పీవీఎన్ఆర్ తాత్వికవేత్త అన్నారు.

బీసీ రిజర్వేషన్లను పూర్తిస్థాయిలో అమలు చేయాలి

బర్కత్‌పుర, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లను పూర్తిస్థాయిలో అమలు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధిని చాటుకోవాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కాచిగూడలోని మోతీమార్కెట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీవో జారీ చేయాలన్నారు. జూలై 21 నుంచి జరగనున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో బీసీ బిల్లును ప్రవేశపెట్టి రాజ్యాంగం 9వ షెడ్యూల్‌ను చేర్చాలన్నారు.

చెన్నారెడ్డినగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

అంబర్‌పేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్ చెన్నారెడ్డినగర్‌లో రూ.31 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ శుక్రవారం ప్రారంభించారు. అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులలో నాణ్యత ఉండాలని సూచించారు. చెన్నారెడ్డినగర్, న్యూపటేల్‌నగర్‌లో పాదయాత్ర నిర్వహించి, బస్తీవాసుల సమస్యలను తెలుసుకున్నారు. డ్రైనేజీ, లోప్రెషర్ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్, నాయకులు రామారావుయాదవ్, మహేష్ ముదిరాజు, లింగారావు, శ్రీనివాస్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిషేధం విధించినా ఆగని గేమ్స్ బెట్టింగ్

పంజాగుట్ట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఆన్‌లైన్ రియల్ మనీ గేమ్స్‌పై పూర్తిస్థాయి నిషేధం విధించడంతో ఆఫ్ షోర్ ఆన్‌లైన్ స్పోర్ట్స్ బెట్టింగ్, క్యాసినోలు విపరీతంగా లబ్ధిపొందుతున్నాయని, ఇది దేశీయ గేమింగ్ పరిశ్రమను చంపుతోందని తమ అధ్యయనంలో వెల్లడైందని పబ్లిక్ రెస్పాన్స్ ఎగైనెస్ట్ హెల్ప్‌నెస్ అండ్ యాక్షన్ ఫర్ రిడ్రెస్సల్(ప్రహార్) సంస్థ అధ్యక్షుడు అభయ్ రాజ్‌మిశ్రా అన్నారు. శుక్రవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్లిక్. బెట్. రిపీట్: కన్స్యూమర్ సర్వే ఆన్ ఫోర్సెస్ డ్రైవింగ్ ఆన్‌లైన్ బెట్టింగ్ అండ్ గ్యాంబ్లింగ్ ఇన్ తెలంగాణ పేరిట తాము ఇటీవల అధ్యయనం చేశామని, రియల్ మనీ గేమింగ్‌లో పాల్గొనే 2,671 మందితో మాట్లాడడం జరిగిందని తెలిపారు. వాటిని క్రోడీకరించి ఒక నివేదికను రూపొందించామన్నారు. తెలంగాణలో రియల్ మనీ గేమింగ్ చట్టవిరుద్ధమని 96 శాతం మంది వినియోగదారులకు తెలుసు, అయినప్పటికీ ఇప్పటికీ ఆన్‌లైన్ స్పోర్ట్స్ బెట్టింగ్, క్యాసినో బెట్టింగ్‌లో పాల్గొంటున్నారు. దాదాపు 87 శాతం మంది ప్రతిరోజూ ఆడుతున్నారని తెలిపారు. త్వరగా డబ్బు సంపాదించడం, వినోదం వంటి అంశాలు ఈ బెట్టింగ్‌కు ప్రధానప్రేరకాలుగా నిలుస్తున్నాయని అన్నారు. యువత, మహిళలు ఆటలు ఆడుతూ పెద్ద మొత్తంలో డబ్బులు పోగొట్టుకుంటున్నారని పేర్కొన్నారు. సమావేశంలో సంస్థ దక్షిణ భారత కన్వీనర్ మగేశ్వరన్, రాష్ట్ర ఇన్‌చార్జి డి.లక్ష్మణ్ యాదవ్, డి.భారతి పాల్గొన్నారు.

మిలటరీ భూముల స్వాధీనానికి ఎంవోయూ

అల్వాల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎండీఏ సుమారు 160 ఎకరాల రక్షణ భూమిని సేకరించేందుకు ఎంఓయూ కుదుర్చుకోనుంది. ఇందుకు 330 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షణ మంత్రిత్వశాఖ(ఎంవోడీ)కు బదిలీచేయనుంది. ఈ మేరకు శనివారం సికింద్రాబాద్ తెలంగాణ, ఆంధ్రాసబ్ ఏరియా ప్రధాన కార్యాలయంలో హెచ్‌ఎండీఏ అధికారులు, డిఫెన్స్ అధికారులు ప్రత్యేకంగా భేటీ అవుతున్నారు. ఈ భూమి రెండు ఎలివేటెడ్ కారిడార్లు శామీర్‌పేట్-ప్యారడైజ్- డైయిరీ ఫామ్ రోడ్డు-మేడ్చల్ వరకు చేపట్టే ఎలివేటెడ్ కారిడార్‌కు కీలకమైంది. భూమి అప్పగింత పూర్తయిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాన్ని ప్రారంభిస్తుంది. రక్షణ మంత్రిత్వశాఖ(ఎంవోడీ) ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న తరువాత పనులు నిర్వహిస్తారు.

బీజేపీ భోలక్‌పూర్ డివిజన్ సీనియర్ నేత మృతి


ముత్యాలు (ఫైల్)

ముషీరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బీజేపీ భోలక్‌పూర్ సీనియర్ నాయకుడు, రంగానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు దండు ముత్యాలు(61) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. ఆయనకు భార్య, నలుగురు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, బీఆర్ఎస్ నగర నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వైశ్రీనివాస్‌రావు తదితరులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి సానుభూతి తెలిపి ధైర్యం తెలిపారు. ముత్యాలు అంత్యక్రియలు బన్సీలాల్ పేట శ్మశానవాటికలో జరిగాయి.

ఆటోడ్రైవర్‌ను బెదిరించి సెల్‌ఫోన్, నగదు చోరీ

బర్కత్‌పుర, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్‌ను బెదిరించి అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్, నగదును దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం. అంబర్‌పేటకు చెందిన బానోత్ సేవల్(45) వృత్తిరీత్యా ఆటోడ్రైవర్. గురువారం రాత్రి 10.30 గంటల సమయంలో ఏడుగురు లక్డీకాపుల్ వద్ద సికింద్రాబాద్ వెళ్లడానికి ఆటో ఎక్కారు. ఇద్దరు సికింద్రాబాద్ వద్ద దిగిపోగా మిగతావారు జామైఉస్మానియా రైల్వే స్టేషన్ వరకు ఆటోలో వచ్చారు. ఆటోడ్రైవర్ డబ్బులు అడగగా ఇవ్వకుండా రైల్వే స్టేషన్‌లోకి పోయారు. వారివెంట వెళ్లిన ఆటోడ్రైవర్‌ను బెదిరించి అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్, రూ.3వేల నగదును తీసుకుని పారిపోయారు. ఆటోడ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళా హ్యాండ్ బ్యాగ్ తస్కరణ

రైలు ప్రయాణికురాలు బ్యాగ్‌ను దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. గాజువాకకు చెందిన సి.సుగుణ(45) కాచిగూడకు రావడానికి విశాఖపట్నం- మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలెక్కింది. ఖమ్మం రైల్వేస్టేషన్ వద్ద హ్యాండ్‌బ్యాగ్ కనిపించలేదు. దానిలో రూ.10 గ్రాముల బంగారు, 90 గ్రాముల వెండి ఆభరణాలున్నాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకే కేసును ఖమ్మం రైల్వేస్టేషన్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.


రథయాత్రలో పాల్గొన్న ప్రజలు

వైభవంగా జగన్నాథ రథయాత్ర


జగనాథ రథయాత్రలో పాల్గొన్న భక్తులు

కవాడిగూడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆబిడ్స్ ఇస్కాన్ ఆలయ ఆధ్వర్యంలో శుక్రవారం జగన్నాథ యాత్రను అత్యంత వైభవంగా నిర్వహించారు. నగరంలోని ఎన్‌టీఆర్ స్టేడియం వద్ద శ్రీజగన్నాథుడుకి ప్రత్యేకపూజలు నిర్వహించి, రథయాత్రను ప్రారంభించారు. రథయాత్ర ముందుకు సాగేదారిలో అడుగడుగునా రోడ్డును శుభ్రంచేసి, భక్తులు ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ దంపతులు, ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు సీతారాందాస్ ప్రభు, రాధేశాంప్రభు, కోఆర్డినేటర్ శంభువైష్ణవ దాస్, విష్ణుప్రసాద్ ప్రభు, హనుమాన్ విజయ్ ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం అతిథులతో, ఆలయ అర్చకులు రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రథం ముందు చీపుర్లతో ఊడ్చి అనంతరం ఎంపీ అనిల్ కుమార్‌యాదవ్, అద్దంకి దయాకర్ రథాన్ని లాగారు. తర్వాత భక్తులు రెండువైపులా తాళ్లతో రథాన్ని ముందుకు లాగారు. ఈ సందర్భంగా హరే కృష్ణ, హరేకృష్ణ భక్తిపాటలతో ఎన్‌టీఆర్ స్టేడియం, ఇందిరాపార్కు పరిసర ప్రాంతాలు మార్మోగాయి, ఎన్‌టీఆర్ స్టేడియం ఇందిరాపార్కు, చౌరస్తా, అశోక్‌నగర్‌చౌరస్తా, జవహర్‌నగర్, ఆర్టీసీ క్రాస్ రోడ్ మీదుగా నారాయణగూడ, హిమాయత్‌నగర్ లిబర్టీ, బషీర్‌బాగ్‌వైపు ముందుకు సాగింది. అనంతరం అద్దంకి దయాకర్, ఎంపీ అనిల్ మాట్లాడుతూ దేశ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించేందుకు ఆబిడ్స్ ఇస్కాన్ దేవాలయం ప్రతినిధులు కృషిచేస్తున్నారని అన్నారు.

ఈ ర్యాలీలో దారిపొడవునా భక్తులు ఇళ్లనుంచి బయటకు వచ్చి జగన్నాథ రథయాత్రను దర్శించుకున్నారు. రథయాత్రలో పాల్గొన్న వేలాదిమంది భక్తులకు ప్రసాదాన్ని పంపిణీచేశారు. లా అండ్ ట్రాఫిక్ పోలీసులు భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు.


హాజరైన ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ దంపతులు



ముషీరాబాద్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ సుప్రియ, డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి, ఉపాధ్యాయులు

ముషీరాబాద్‌లో బడిబాటకు స్పందన

- జోరుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు

ముషీరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ విద్యా మండలి పరిధిలో బడిబాట కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తున్నది. విద్యార్థులు పెద్దఎత్తున ప్రభుత్వ పాఠశాల అడ్మిషన్లు తీసుకుంటున్నారు. ఈనెల 6వ తేదీ నుంచి మండల పరిధిలో ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ బడీడు పిల్లలు, డ్రాప్ ఔట్‌లను గుర్తించి, వారి తల్లిదండ్రులకు నచ్చజెప్పి పాఠశాలల్లో చేరిపించారు. ముషీరాబాద్ మండల పరిధిలోని 7 ఉన్నత పాఠశాలల్లో 345 మంది విద్యార్థులు అడ్మిషన్‌లు తీసుకోగా, 22 ప్రాథమిక పాఠశాలల్లో 399 మంది విద్యార్థులు అడ్మిషన్‌లు తీసుకున్నారని ఉపాధ్యాయులు తెలిపారు.

ఉచిత వసతులపై ప్రచారం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమానికి గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి అడ్మిషన్‌లు జరగడానికి ఉపాధ్యాయుల విస్తృత ప్రచారమే కారణం. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత వసతులపై ప్రచారం చేయడంతో విద్యార్థులు పెద్దఎత్తున చేరారు. మధ్యాహ్న భోజనం, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, రెండు జతల స్కూల్ యూనిఫాంలు, విశాలమైన తరగతిగదులు, ఆటస్థలాలు, ప్రతిభావంతులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన జరుగుతుందని ప్రచారం చేశారు. అంతే కాకుండా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా డిజిటల్ క్లాస్‌లు, ఏఐ క్లాసులు సైతం తీసుకుంటున్నామని ప్రచారం చేశారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు ఆసక్తి చూపించారని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. గత సంవత్సరంతో పోల్చితే ఈ విద్యాసంవత్సరం 10వ తరగతిలో ఉత్తీర్ణత శాతం కూడా పెరిగిందన్నారు. స్పెషల్ క్లాసులు, మోడల్ పేపర్స్, పరీక్షల సమయంలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే స్పెషల్‌క్లాసులు, విద్యార్థులకు వచ్చే అనుమానాలను నివృత్తి చేస్తున్నామని పేర్కొన్నారు.

ఎక్కువగా ప్రవేశాలు



ముషీరాబాద్ విద్యామండలి పరిధిలో బడిబాటకు విశేష స్పందన లభించింది. ఉపాధ్యాయులు ప్రతిరోజు ఇంటింటికీ వెళ్లి బాధ్యతతో ప్రచారం చేశారు. అందువల్లే ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో ఎక్కువ సంఖ్యలో విద్యార్థుల ప్రవేశాలు జరిగాయి.

- శ్రావణ్ కుమార్, ముషీరాబాద్ విద్యామండలి డీఈవో

ధర్మారావుకు సత్కారం


కె.ధర్మారావును సత్కరిస్తున్న మధుసూదనాచారి, కృష్ణమోహనరావు

చిక్కడపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రచయిత, నటుడు, లఘు డాక్యుమెంటరీ చిత్ర నిర్మాత డా.కె.ధర్మారావు అభినందన సత్కారం కార్యక్రమం శుక్రవారం త్యాగరాయ గానసభలో మోహన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, బీసీ కమిషన్ పూర్వచైర్మన్ డా.వకుళాభరణం కృష్ణమోహనరావు మాట్లాడుతూ దేశవిదేశాల్లో మన తెలుగు కళలు ఉట్టిపడేలా కార్యక్రమాలను ధర్మారావు నిర్వహించారన్నారు. వచ్చేనెల 3వతేదీనుంచి 5 వరకు 2025 తానా డెట్రాయిట్ సభల్లో పాల్గొనే ధర్మారావును సత్కరించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మోహన్‌కుమార్‌గాంధీ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

నల్లకుంట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేటలోని హిందూ శ్మశానవాటికలో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. శుక్రవారం కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే శ్మశాన వాటికలో పనులను పరిశీలించి, మాట్లాడారు. శ్మశానవాటికలో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈ ప్రశాంతి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సీహెచ్.చంద్రమోహన్, నాయకులు మోర శ్రీరాములు ముదిరాజ్ పాల్గొన్నారు.

అటల్ సేవా దళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఐజాక్‌రాజ్



నల్లకుంట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అటల్ సేవా దళ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నల్లకుంటకు చెందిన బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర మీడియా కన్వీనర్ ఎం.ఐజాక్ రాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం అటల్ సేవా దళ్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు ఎస్.రఘునందన్ ఆయనను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రకటిస్తూ ఉత్వర్వులు జారీచేశారు.

'ఆర్టీసీ టూర్ ప్యాకేజీలను సద్వినియోగం చేసుకోవాలి'

బర్కత్‌పుర, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడానికి ఆర్టీసీ చేపట్టిన టూర్ ప్యాకేజీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కోరారు. శుక్రవారం బర్కత్‌పుర ఆర్టీసీ డిపోలో టూర్ ప్యాకేజీ బస్సును కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బర్కత్‌పుర ఆర్టీసీ డిపో మేనేజర్ ఆర్.మంజులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ టూర్ ప్యాకేజ్ ద్వారా పుణ్యక్షేత్రాలను అతి తక్కువ ధరలో సందర్శించి, క్షేమంగా రావచ్చునని అన్నారు. డీఎం ఆర్.మంజుల మాట్లాడుతూ రోజూ ఉదయం 5 గంటలకు మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ నుంచి ఈ టూర్ ప్యాకేజ్ యాత్ర ప్రారంభమవుతుందన్నారు. పుణ్యక్షేత్రాలకు వెళ్లేవారు 9492025577, 9000406069 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

మిసెస్ ఆసియా వరల్డ్-2025 విజేత రేవతి




హిమాయత్‌నగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): యుఎస్‌తోపాటు భారత్‌లో 16 ఏళ్లకు పైగా సామాజిక సేవ, మహిళా సాధికారత, ప్రపంచ మానవతా విలువల కోసం కృషి చేస్తున్నందుకు గాను 'మిసెస్ ఆసియా వరల్డ్ విన్నర్-2025' కిరీటాన్ని నగరానికి చెందిన డాక్టర్ రేవతి దక్కించుకున్నారు. ఈ విషయాన్ని మానస్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ సూర్యరేవతి మెట్టుకూరు శుక్రవారం తెలిపారు. ఈనెల 22న దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ కార్యక్రమంలో ఈ అరుదైన గౌరవం దక్కిందన్నారు.

జెన్‌కో డైరెక్టర్ బాలరాజుకు సన్మానం

నల్లకుంట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విద్యుత్ సౌధ కార్యాలయంలో నూతన జెన్‌కో డైరెక్టర్‌గా పి.బాలరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో ఆయనను జాతీయ మాల విద్యుత్ ఉపకులాల సంఘం జాతీయ అధ్యక్షుడు బూరెల విజయభాస్కర్‌రావు, ది నేషనల్ అంబేద్కర్ సేన జాతీయ అధ్యక్షుడు మన్నె శ్రీధర్‌రావు, సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తాలుకా రాజేష్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో సేన నాయకులు శాస్త్రి ప్రవీణ్, కాడారం విజయ్‌కుమార్, పుణ్య భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును విమర్శించే అర్హత కవితకు లేదు

రాంనగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి పాటుపడిన ఏపీ సీఎం చంద్రబాబును విమర్శించే అర్హత ఎమ్మెల్సీ కవితకు లేదని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా పేర్కొన్నారు. బనకచర్ల వ్యవహారంపై కవిత చేసిన వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. శుక్రవారం పార్టీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లిక్కర్ స్కామ్‌లో తెలంగాణ పరువుతీసి తీహారీ జైలులో చిప్పకూడు తిన్న కవిత పరిపాలన దక్షుడైన చంద్రబాబుపై విమర్శలు చేయడమా అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లెల కిషోర్, బాల్‌రాజ్ గౌడ్, ఎస్.ప్రకాష్, కిరణ్, శ్యామ్‌సుందర్, అనిల్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ బీసీ కుల సంఘాల జేఏసీ కన్వీనర్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు

యుగంధర్‌గౌడ్‌పై దాడి చేసిన దుండగులను అరెస్ట్ చేయాలి

- తెలంగాణ బీసీ కుల సంఘాల జేఏసీ

రాంనగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్‌పై దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్ట్ చేసి చట్టపరంగా శిక్షించాలని తెలంగాణ బీసీ కుల సంఘాల జేఏసీ కన్వీనర్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం చిక్కడపల్లిలోని సంఘం కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తి, కొత్తకోట కేంద్రంగా నిత్యం ప్రజా సమస్యలు, బీసీల డిమాండ్లపై పోరాటం నిర్వహిస్తున్న యుగంధర్‌గౌడ్‌పై గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు దాడి చేశారని తెలిపారు. ఈ దాడిని బీసీలపై జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు. అవినీతి అధికారులు, రాజకీయ నాయకుల ఆగడాలను ప్రశ్నించినందుకే ఆయనపై దాడి చేశారని పేర్కొన్నారు. దాడి జరిగి 24 గంటలు పూర్తయినా దుండగులను పోలీసులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ యెలికట్టే విజయ్‌కుమార్ గౌడ్, బీసీ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దుర్గయ్యగౌడ్, నాయకులు భైరు శేఖర్, నాగేశ్వర్‌గౌడ్, బడేసాబ్, వెంకటేష్‌గౌడ్, ఐలన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్, హైదరాబాద్ సిటీ-1 పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు నాగేశ్వరరావు, వినోద్‌కుమార్ తెలిపారు. ప్రివెంటివ్ మెడిసిన్, మహావీర్ ఓహెచ్, ఏపీ టూరిజం 11కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధుల్లో ఉదయం 10నుంచి మధ్నాహ్నం 1 గంట వరకు, పార్శిగుట్ట పరిధిలో 11నుంచి 11.30 గంటల వరకు, అపో, రామ్‌లీలా మైదాన్, గెలాక్సీ, శాంతాబాయి నర్సింగ్‌హోమ్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, ఆనంద్‌నగర్ పరిధిలో 3నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వీఆర్‌కే ఫణికి ఘంటసాల స్వర్ణపతకం బహూకరణ

చిక్కడపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గాయకులు వీఆర్‌కే ఫణికి ఘంటసాల స్వర్ణపతకాన్ని బహూకరించి సత్కరించారు. వంశీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి త్యాగరాయ గానసభలో కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి వర్ధంతి సందర్భంగా గాయకులు వీఆర్‌కే ఫణి నిర్వహణలో 'నేనొక పూల మొక్కకడ నిల్చి' ప్రయివేట్ గీతాల ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానగాయకుడు ఫణిని స్వర్ణపతకంతో వంశీ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు డా.వంశీరామరాజు, గాయని సురేఖా మూర్తిదివాకర్ల సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని అంతర్జాలంలో కరుణశ్రీ కుటుంబ సభ్యులు తిలకించడం హర్షదాయకమన్నారు.

సీనియర్ సిటిజన్స్ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవాలి


ఆత్మీయ సమ్మేళనంలో శేషసాయిని సత్కరిస్తున్న బాల్యమిత్రులు

నల్లకుంట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ పొందిన వారి కోసం కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన సీనియర్ సిటిజన్స్ స్కీమ్ వృద్ధుల శేష జీవితానికి భరోసా కల్పిస్తుందని నల్లకుంట ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థి, బీజేపీ స్టేట్ కో-ఆర్డినేటర్ రొయ్యూరు శేషసాయి పేర్కొన్నారు. పదవీ విరమణ పొంది, 60 ఏళ్లపై బడి అర్హులైన వారికి ఈ పథకం ఎంతో దోహదపడుతుందన్నారు. శుక్రవారం నల్లకుంట ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థుల త్రైమాషిక ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న సీనియర్ సిటిజన్ కార్డు కోసం 60 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రొయ్యూరు శేషసాయిని బాల్యమిత్రులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నల్లకుంట ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు కె.శ్రీనివాస్, రామకృష్ణమాచారి, విజయ్‌కుమార్, వాసు, రమణ, షరీఫ్, జైపాల్‌రెడ్డి, నటుడు విశ్వమోహన్, కృష్ణ, ప్రముఖ సంగీత విద్వాంసులు పోపూరి శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి : ఎన్‌పీఆర్‌డీ



హెలెన్‌కెల్లర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాజేందర్, మల్లికార్జున్

చిక్కడపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): హెలెన్‌కెల్లర్ స్ఫూర్తితో దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) జాతీయ అధ్యక్షుడు తుడుం రాజేందర్ పిలుపునిచ్చారు. హెలెన్‌కెల్లర్ జీవితమే ఓ గొప్ప పాఠశాల అన్నారు. గాంధీనగర్‌లోని ఎన్‌పీఆర్‌డీ ఇండియా సెంట్రల్ ఆఫీస్‌లో హెలెన్‌కెల్లర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్పైనల్ కార్డ్ ఇంజూరీస్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ షఫీ, ఎన్‌పీఆర్‌డీ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దైనంపల్లి మల్లికార్జున్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మంద భిక్షపతియాదవ్, వర్కింగ్ అధ్యక్షుడు శబరి, ధనమ్మ, బాబురావు, నర్సింగ్, సత్యనారాయణ, గంగాధర్, శ్రీకాంత్‌రెడ్డి, సరిత, దావూద్, గణేష్ పాల్గొన్నారు. రాజేందర్ హెలెన్‌కెల్లర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కెల్లర్ ఆత్మవిశ్వాసంతో సమాజం కోసం చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. తెలంగాణ ప్రభుత్వం కెల్లర్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరారు.